# ఏపీపీఎస్సీ ఉద్యోగాలకు వయోపరిమితి గండం

- 2014లో వయోపరిమితి 34 నుంచి 40 ఏళ్లకు పెంచుతూ జీవో
- సెప్టెంబర్‌తో ముగియనున్న జీవో గడువు
- అవకాశం కోల్పోతున్న లక్షలాది అభ్యర్థులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం 10వేల ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా.. లక్షలాది అభ్యర్థులకు వయోపరిమితి గండంగా పరిణమిస్తోంది. రెండేళ్లుగా ఒక్క ఉద్యోగానికీ సర్కారు నోటిఫికేషన్ జారీ చేయలేదు. అలాగే రాష్ట్ర విభజన నేపథ్యంలో ఉద్యోగార్థులకు వయోపరిమితి పెంచుతూ ఇచ్చిన జీవో ఈ ఏడాది సెప్టెంబరుతో ముగియనుంది. దీంతో లక్షలాది నిరుద్యోగులు అవకాశం కోల్పోనున్నారు. వయోపరిమితి పెంచినా.. రెండేళ్లుగా ప్రభుత్వం ఒక్క నోటిఫికేషనూ ఇవ్వక ఉద్యోగాలకు దూరమవ్వాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఆరేళ్లు పెంచారు.. నోటిఫికేషన్లు మరిచారు**

రాష్ట్ర విభజన నేపథ్యంలో 2014 సెప్టెంబర్ 23న జీవో నెంబర్ 295ను విడుదల చేస్తూ ప్రభుత్వ ఉద్యోగాలకు గరిష్ట వయోపరిమితిని 40 ఏళ్లకు పెంచింది. అంతకుముందు అది 34 ఏళ్లు కాగా దానికి అదనంగా ఆరేళ్లు చేర్చింది. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 39 ఏళ్లు కాగా వారికీ ఈ పెంపు వర్తిస్తుందని పేర్కొంది. అయితే, శారీరక దారుఢ్య పరీక్షలతో సంబంధమున్న పోలీసు, ఆబ్కారీ, ఎక్సైజ్, అగ్నిమాపక, జైళ్ల శాఖల పోస్టులకు ఇది వర్తించదు. అంతేకాదు, ఈ జీవో 2016 సెప్టెంబర్ వరకు మాత్రమే అమల్లో ఉంటుంది. అయితే, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ నుంచి కానీ, ఇతర ఏ నోటిఫికేషనూ వెలువడలేదు. ఫలితంగా వయోపరిమితి ఆరేళ్లు పెంచినా.. వయసు మీరుతున్న నిరుద్యోగులకు దక్కిన ప్రయోజనమేమీ లేదు. ఇప్పటికే రెండేళ్లు వృథా కావడంతో దాదాపు 3 నుంచి 4 లక్షల అభ్యర్థులు అవకాశం కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఇచ్చిన వయోపరిమితి పెంపునూ దాటిపోవడంతో వారికి దరఖాస్తు చేసుకునే అవకాశం లేదు. అలాగే డిగ్రీ లెక్చరర్లు, జూనియర్ లెక్చరర్లు తదితర అనేక పోస్టులకు నోటిఫికేషన్లు వెలువడి కొన్నేళ్లు దాటింది. దీంతో తాము భవిష్యత్తు కోల్పోయామని, వయోపరిమితి పెంచినా అవకాశాలు అందుకోలేకపోతున్నామని ఆ అభ్యర్థులు వాపోతున్నారు.

**సడలింపు ఇవ్వాలంటున్న నిరుద్యోగులు**

2014 నుంచి ఇప్పటివరకు ఉద్యోగ ప్రకటనలు రానందున రెండేళ్లు కోల్పోయామని, దాన్ని సర్దుబాటు చేసేలా ప్రభుత్వమే తిరిగి వయోపరిమితి పెంచాల్సిన అవసరముందని నిరుద్యోగులు కోరుతున్నారు. సకాలంలో నిర్ణీత సమయానుసారం నోటిఫికేషన్లు ఇవ్వనందున ఆ మేరకు సడలింపు ఇవ్వాలంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలకు ఏపీలో గరిష్ట వయోపరిమితి 40 ఏళ్లకు పెంచగా, తెలంగాణలో 44 ఏళ్లకు పెంచడాన్ని గుర్తుచేస్తున్నారు. పోలీసు ఉద్యోగాలకు కనీసం 3 ఏళ్లు, ఇతర వాటికి 44, లేదా 45 ఏళ్లకు వయోపరిమితి పెంచాలంటున్నారు. వయసు పైబడిన వారిని ప్రభుత్వ ఉద్యోగాల్లో నియమిస్తే కార్యాలయాల్లో పని దెబ్బతింటుందన్న కొందరి అభిప్రాయాన్ని వారు కొట్టిపారేస్తున్నారు. ఎవరూ అడగకపోయినా 58 ఏళ్ల పదవీ విరమణ వయసును 60 ఏళ్లకు పెంచి వృద్ధులతో పనిచేయించుకుంటున్న ప్రభుత్వం ఉద్యోగ నియామకాలకు వయోపరిమితి పెంచితే ఇబ్బందులు ఎదురవుతాయనడంలో అర్థం లేదని వాదిస్తున్నారు.

# నిరుద్యోగుల ఆందోళన

**గ్రూప్-1లో గ్రూప్-2 పోస్టుల విలీనానికి వ్యతిరేకంగా రాస్తారోకో**




గుంటూరు శంకర్ విలాస్ సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న నిరుద్యోగులు

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రూప్-1 సర్వీసుల్లోకి గ్రూప్-2 పోస్టులను విలీనం చేయాలనే నిర్ణయంతో ఏపీపీఎస్సీ చారిత్రక తప్పిదానికి పాల్పడుతోందని ఆరోపిస్తూ గుంటూరులో నిరుద్యోగులు ఆందోళనకు దిగారు. ఏపీపీఎస్సీ అనుసరిస్తున్న విధానంతో లక్షలాది నిరుద్యోగుల భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతోందంటూ నిరుద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గుంటూరు శంకర్ విలాస్ సెంటర్‌లో బుధవారం రాస్తారోకోకు దిగారు. ఈ ఆందోళనకు మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, ఎస్ఎఫ్ఐ, సమైక్యాంధ్ర విద్యార్థి జేఏసీ, యువజన కాంగ్రెస్ నాయకులు మద్దతు పలికారు. కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 1.42 లక్షల ఉద్యోగాలు ఖాళీ ఉండగా, కేవలం 10 వేల పోస్టుల భర్తీకి మాత్రమే నోటిఫికేషన్లు విడుదల చేశారని విమర్శించారు. గ్రూప్-1లోని జిల్లాస్థాయి, గ్రూప్-2లోని మండల స్థాయి పోస్టులకు ఏ [illegible] ముడిపెడతారని ప్రశ్నించారు. గ్రూప్-2 పరీక్షను పాత విధానంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. దీనిపై పీడీఎఫ్ ఎమ్మెల్సీల తరఫున ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, వైఖరి మార్చుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఆందోళనకు 200 మంది నిరుద్యోగులు రాగా.. వారిలో సగం మంది మహిళలు ఉన్నారు.

**'నిరుద్యోగులతో చెలగాటం వద్దు'**

సాక్షి, హైదరాబాద్: గ్రూప్-2 పోస్టులను గ్రూప్-1లోకి విలీనం చేయాలన్న ఏపీపీఎస్సీ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని గిరిజన విద్యార్థి సమాఖ్య (జీఎస్ఎఫ్) వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్ నాయక్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగాలు వస్తాయని ఆశగా నిరుద్యోగులు ఓట్లు వేస్తే అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి నష్టం కలిగించేలా చంద్రబాబు నిర్ణయాలు తీసుకుంటున్నారని మండిపడ్డారు.